# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, శుక్రవారం 20 డిసెంబర్ 2024 HYDERABAD


## మల్లంపేట్-బాచుపల్లి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయండి

### శాసనమండలిలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, డిసెంబర్ 19 : దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ నుంచి మల్లంపేట్ మీదుగా బాచుపల్లి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. ఈ మేరకు గురువారం జరిగిన మండలి సమావేశాల్లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు రోడ్డు విస్తరణ అంశాన్ని లేవనెత్తడంతో పాటు మల్లంపేట్‌లోని ఓ దేవాలయం వద్ద రోడ్డు విస్తరణకు హెచ్ఎండబ్ల్యూఎస్(జలమండలి) పైపులైన్ అవరోధంగా మారిందన్నారు. అక్కడ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ పోల్స్‌ను సైతం తొలగించాల్సి ఉందని, దీనిని మార్చాలంటే రూ.60లక్షల వరకు ఖర్చు అవుతుందని జలమండలి అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. నిధులు కేటాయించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. కాగా ఎమ్మెల్సీ చేసిన విజ్ఞప్తికి మంత్రి త్వరలోనే పనులు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.



## గ్రేటర్ @ 15.0 డిగ్రీలు

సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరగడంతో చలి తీవ్రత కొంత తగ్గుముఖం పట్టింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.4డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15.0డిగ్రీలు, గాలిలో తేమ 55శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



# 14 షట్టర్ల కూల్చివేత



## మణికొండలో హైడ్రా విధ్వంసం

- రెసిడెన్షియల్ నిర్మాణాల్లో వ్యాపారం చేస్తున్నారంటూ నోటీసులు
- సమాధానం చెప్పలేదంటూ కూల్చివేతలు
- చిన్నచిన్న వాళ్లే హైడ్రాకు లక్ష్యమంటూ ఆక్రోశం వ్యక్తం చేసిన బాధితులు
- హైడ్రా తీరుపై దుమ్మెత్తి పోసిన స్థానికులు

## అనుమతులున్నా.. పన్నులు కడుతున్నా నేలమట్టం



మణికొండ మున్సిపాలిటీ అల్కాపూర్ టౌన్‌షిప్‌లో కమర్షియల్ షట్టర్లను కూల్చివేసిన అధికారులు

సిటీబ్యూరో/మణికొండ, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): వాణిజ్య పన్నులు కడుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ లోపు హైడ్రా వచ్చింది.. నోటీసులిచ్చింది. సమాధానం ఎందుకివ్వలేదంటూ.. తెల్లవారుజామునే వచ్చి 14 షట్టర్లను కూల్చేసింది. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపు షాపులన్నీ శిథిలాలుగా మిగిలాయి. తమ కళ్లముందే వ్యాపారాలతో కళకళలాడుతున్న షట్టర్లన్నింటినీ హఠాత్తుగా కూల్చివేయడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా తీరుపై దుమ్మెత్తి పోశారు.

మణికొండ మున్సిపాలిటీ అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని అనుహర్ మార్నింగ్ రాగా అపార్ట్‌మెంట్స్‌లో ఎటువంటి అనుమతి లేకుండా వాణిజ్య కార్యకలాపాలు కొనసాగిస్తున్నారన్న కారణంతో 14 షట్టర్లను అధికారులు గురువారం తొలగించారు. రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం.. నివాసిత భవనాల పేరుతో అనుమతులు పొంది వ్యాపార కేంద్రాలుగా వినియోగిస్తున్న నిర్మాణాలను కూల్చివేయాలని స్థానిక మున్సిపాలిటీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టడంతో స్థానికంగా కలకలం రేగింది. గురువారం ఉదయం అల్కాపూర్‌కు చేరుకున్న హైడ్రా, మున్సిపల్, పోలీసులు, సిబ్బందిని అపార్ట్‌మెంట్‌లోకి రాకుండా అడ్డుకున్నారు. అనంతరం అధికారులు రెండు జేసీబీలతో షట్టర్లను ధ్వంసం చేశారు. దీంతో మున్సిపల్, హైడ్రా అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నం.25లో అనుహర్ హోం నిర్మాణరంగ సంస్థ 'మార్నింగ్ రాగా' పేరుతో 2016 హెచ్ఎండీఏ నుంచి గేటెడ్ కమ్యూనిటీ అనుమతులు పొంది, నిర్మాణాలను 2018లో పూర్తిచేసి, అలాగే ఎన్ఓసీ పొందారు. తర్వాత 2023లో వ్యాపార కేంద్రాలుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో షట్టర్లను ఏర్పాటు చేసిన సంస్థ విడివిడిగా వివిధ వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు కేటాయింపులు చేసింది. ఇందుకు గాను స్థానిక మున్సిపాలిటీకి కమర్షియల్ పన్నులు సైతం చెల్లిస్తున్నది. అయితే పై అంతస్తుల్లోని నివాసితులు వ్యాపార కేంద్రాలతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. వ్యాపార కేంద్రాలను తక్షణమే మూసివేయాలని మున్సిపల్, హెచ్ఎండీఏ అధికారులను ఆశ్రయించారు. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఈనెల 7న అపార్ట్‌మెంట్‌లోని వాణిజ్య సముదాయాలను పరిశీలించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వాటి ని తొలగించాలని అధికారులకు సూచించారు. అంతకుముందే మున్సిపల్ అధికారులు నవంబర్ 27న ఆ అపార్ట్‌మెంట్స్‌కు నోటీసులు జారీ చేసి ఏడురోజుల్లో తొలగించాలని ఆదేశించారు. ఆ నోటీసులకు అపార్ట్‌మెంట్ యజమాని నుంచి స్పందన రాకపోవడంతో గురువారం ఉదయం అక్కడికి చేరుకున్న సిబ్బంది 14 షట్టర్లను తొలగించారు.

### ఆందోళనకు దిగిన బాధితులు..

కూల్చివేతల విషయం తెలుసుకున్న వ్యాపార నిర్వాహకులు ఆందోళనకు దిగారు. ఇన్నాళ్లు తాము వ్యాపారం చేసుకుంటూ కమర్షియల్ ట్యాక్సులు చెల్లిస్తున్నామని.. కొంతమంది వ్యక్తుల ఫిర్యాదుతో హైడ్రా అధికారులు ఎలా చర్యలు తీసుకుంటారని మండిపడ్డారు. షట్టర్లను కూల్చివేయడంపై స్థానికులు దుమ్మెత్తి పోశారు. ఇలాంటి నిర్మాణాలు మణికొండలో 60 వేల వరకు ఉంటాయని ఇవన్నీ రంగనాథ్ కూల్చివేయించాలంటూ.. హైడ్రా అలా చేయగలదా? అని ప్రశ్నించారు.

### అన్నీ కూల్చే దమ్ముందా..?



అనుమతులు మీరే ఇస్తరు..కూల్చివేతలు మీరే చేస్తరు..అసలు ఇక్కడ ఏం జరుగుతుంది. హైడ్రాకు ఏం సంబంధం. నిజాయితీగా చేయాలనుకుంటే మణికొండ నుంచి మొదలు పెట్టి చార్మినార్ దాకా కూల్చివేతలు చేపట్టాలి. ఎవరో ఫిర్యాదు చేస్తే నిజాయితీ పరుల్లా కూల్చివేతలు చేస్తున్నారు బాగుంది. ఒకటి రెండు కాదు అంతటా..రెసిడెన్షియల్ అనుమతులు పొంది గ్రౌండ్‌ఫ్లోర్‌లో వ్యాపార కేంద్రాలను నడుపుకుంటూ వేలాదిమంది జీవనం సాగిస్తున్నారు. ఇవన్నీ కూల్చివేస్తారా? దమ్ముందా? ఫిర్యాదు దారుడే పెద్ద బ్లాక్‌మెయిలర్. అలాంటి వాళ్లకే హైడ్రా స్పందిస్తుందా? ఇక్కడ నాలుగు షట్టర్లు వేసుకుని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వారినే టార్గెట్ చేయడం దారుణం. నిజంగా హైడ్రాకు దమ్ముంటే అంతటా కూల్చివేతలు చేట్టాలి.

-వి.బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ నార్సింగి డైరెక్టర్

### రోడ్డున పడేశారు..



రెండున్నరేండ్ల కింద ఇక్కడ కూరగాయల వ్యాపారం పెట్టాలని అపార్టుమెంటు వాసులే పదేపదే అడిగితే మేము వ్యాపారం ప్రారంభించాం. నా భర్త చనిపోయి మూడు మాసాలయ్యింది. ఆ బాధలో కొట్టుమిట్టాడుతున్న నేను ఒంటరి మహిళగా పదిమందికి ఉపాధి కల్పిస్తూ తాజా కూరగాయల దుకాణం నడుపుతున్న. ఇప్పుడు ఎవ్వరో ఫిర్యాదు చేశారంటూ అధికారులు వచ్చి కూల్చేశారు. కనీస సమాచారం లేకుండా కూల్చివేతలు చేయడంతో నేను నా కుటుంబం, నాపై ఆధారపడి పనిచేస్తున్న వారంతా రోడ్డుపాలయ్యారు. దీనికి ఎవరూ బాధ్యులు? ఇంత దారుణంగా ఎక్కడా లేదు. నా కుటుంబం ఉసురు తగులుతది.

- నీలిమా, బండి కూరగాయల వ్యాపారి

### నగరంలో అంతటా కూల్చివేస్తారా?



కమర్షియల్ కాదంటూ కూల్చివేస్తున్నారు..కమర్షియల్ ట్యాక్సు ఎందుకు తీసుకుంటున్నారు. ఒక్క ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ వేలల్లో ఉన్న ఇలాంటి భవనాలపై కూడా ఇదే విధంగా చర్యలు తీసుకోవాలి. నిన్ననే జూలై 2024 తర్వాత చేపట్టిన నిర్మాణాల్లో ఆక్రమణలు జరిగితే చర్యలు తీసుకుంటామని చెప్పి ఇప్పుడు 2016లో నిర్మించిన భవనంపై కూల్చివేతలు చేయడమేమిటీ. ఏ హక్కుతో కూల్చారు? ఓ మహిళ కూరగాయల దుకాణం నడుపుకుంటుంటే..స్వయంశక్తితో బతుకుతుంటే మహిళలను ఏడిపించే ప్రభుత్వం ఏం ప్రభుత్వం ఇదీ. పేదవారిపై హైడ్రా పెత్తనం ఏమిటీ. హైదరాబాద్‌లోని లక్షలాది దుకాణాలు ఇదేవిధంగా ఉన్నాయి కూల్చుతారా? ఇదేనా సమ న్యాయమంటే..ఇన్నీ నిర్మాణాలున్నప్పుడు పాలసీ ఏర్పాటు చేసి సూచనలు చేయాలే తప్ప డైరెక్టుగా కూల్చివేస్తారా? ప్రజాసంక్షేమం కన్నా విధ్వంసానికే హైడ్రా పనిచేస్తుంది. కేవలం కొంతమంది వ్యక్తులకే కొమ్ముకాస్తూ.. దశ, దిశ లేకుండా హైడ్రాకూల్చివేతలు చేయడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం.

-డా.జయంతి, షట్టర్ యజమాని

### అనుమతులు లేని వ్యాపార సముదాయాలను తొలగిస్తాం

#### హైడ్రా కమిషనర్ రంగనాథ్

అల్కాపూర్‌లో మార్నింగ్ రాగా అపార్ట్‌మెంట్స్‌లో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్‌గా వినియోగిస్తున్న 14 షట్టర్లను స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ సిబ్బంది హైడ్రా సమక్షంలో తొలగించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో మార్నింగ్ రాగాలో నివాసముంటున్న 16 ప్లాట్ల యజమానుల నుంచి హైడ్రాకు ఫిర్యాదు వచ్చిందని.. మూడేళ్ల క్రితం నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కూడా స్థానికులు ఫిర్యాదు చేశారని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన తర్వాత ఇరు వర్గాలను పిలిచి హైడ్రా కార్యాలయంలో సమావేశపరిచి పత్రాలను పరిశీలించామన్నారు. అపార్ట్‌మెంట్ యజమానికి నోటీసులిచ్చినా పట్టించుకోలేదని, షోకాజ్ నోటీసులు ఇచ్చినా.. డెమాలిషన్ నోటీసులు ఇచ్చినా స్పందించలేదని తెలిపారు. జీహెచ్ఎంసీ మినహా ఔటర్ రింగ్‌రోడ్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ 2019 సెక్షన్17 బి(2)ప్రకారం హైడ్రాకు సమకూరిన హక్కుల మేరకు కూల్చివేతలకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ అపార్ట్‌మెంట్స్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను రంగనాథ్ మీడియాకు విడుదల చేశారు.

## నీటి పారుదలలో హైడ్రా కలకలం!

చెరువుల హద్దుల నిర్ధారణలో పాత ఎన్ఓసీలతో సమస్య

ఇప్పటికే ముగ్గురు అధికారులపై చర్యలకు సిఫారసు

మరో ఎనిమిది మందిపై ఫిర్యాదు చేయనున్న హైడ్రా

సిటీబ్యూరో, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): హైడ్రా చర్యలతో నీటిపారుదల శాఖలో కలకలం రేగుతోంది. ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు సంబంధించిన నివేదికలో అవకతవకలకు పాల్పడినట్లు ముగ్గురు సీనియర్ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ప్రభుత్వానికి హైడ్రా సిఫారసు చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఆ ముగ్గురు అధికారులపై పెనాల్టీ చర్యలు తీసుకునే దిశగా చర్యలు ప్రారంభించారు. లేక్ వ్యూ అపార్ట్‌మెంట్స్ పేరిట వెలిసిన చాలా హైరైజ్ భవనాల విషయంలో నీటి పారుదల శాఖ అధికారుల ఎన్ఓసీలు సమస్యగా మారుతున్నాయని పలు అంతర్గత సమావేశాల్లో రంగనాథ్ వ్యాఖ్యానించారు. హైడ్రా ప్రారంభమైన కొన్ని రోజులకే ఇరిగేషన్‌కు సంబంధించిన ఒక అధికారిపై చర్యలకు ప్రభుత్వానికి హైడ్రా లేఖ రాసింది. తాజాగా రిటైర్డ్ ఎస్ఈ వెంకటేశం, ఈఈలు భీమ్ ప్రసాద్, శేఖర్‌రెడ్డిలపై చర్యలకు సిఫారసు చేసింది. మరో ఎనిమిది మంది నీటి పారుదల శాఖ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని లేఖలు రాయనున్నట్లు సమాచారం. వీరంతా తమ పరిధిలో ఉన్న జోన్లలో ఎన్ఓసీలు జారీ చేయడం వల్ల చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురయ్యాయంటూ రంగనాథ్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.

### ఎనిమిది మందిపై ఫిర్యాదుకు నివేదిక..

పటాన్‌చెరు, ఇస్నాపూర్, దుండిగల్, ఘట్‌కేసర్, శంషాబాద్, మేడ్చల్, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం, తుర్కయాంజల్ తదితర ప్రాంతాల్లో లేక్‌వ్యూ ప్రాజెక్టుల పేరిట వెలిసిన పలు అపార్ట్‌మెంట్లకు పాత మ్యాపులతో ఎన్ఓసీలు ఇచ్చినట్లు హెచ్ఎండీఏ, ఇరిగేషన్, హైడ్రా అధికారులు గుర్తించారు. హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో సదరు స్థలం బఫర్ జోన్‌లో ఉన్నట్లు తేలితే గూగుల్ మ్యాపులతో దరఖాస్తులను జతచేసి, పాత మ్యాపుల ఆధారంగా ఎన్ఓసీలు తీసుకున్నట్లు హైడ్రా గుర్తించింది. కొన్నిచోట్ల మ్యాపులే మాయమయ్యాయని కూడా తమ పరిశీలనలో తేల్చారు. అంతేకాకుండా ఇటీవల హైడ్రా బృందం పలు చెరువుల సందర్శనలో నీటిపారుదల శాఖ అధికారుల తీరుపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆక్రమణదారులపై పోలీస్‌లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అయితే కొన్ని చోట్ల ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఎన్ఓసీలు హైడ్రాకు తలనొప్పిగా మారాయని హైడ్రా అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా హైదరాబాద్ చుట్టుపక్కల లేక్‌వ్యూ ప్రాజెక్ట్‌లలో చాలా వరకు బఫర్‌జోన్‌లో లేదా ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయా అనేది నిర్ధారించాల్సిన అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చి, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తేలడంతో తాజాగా ఎనిమిది మంది అధికారుల పేర్లతో ఒక లిస్ట్ తయారు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని త్వరలోనే రంగనాథ్ సాక్ష్యాధారాలతో సహా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది. ఇందులో ఏ చెరువుకు సంబంధించి ఏ అధికారి హద్దుల నిర్ధారణలో అవకతవకలు చేశారనే అంశాన్ని పొందుపరిచి సమగ్ర నివేదిక తయారు చేస్తున్నారు. దీనికోసం ఇద్దరు ఇరిగేషన్ అధికారుల సహకారం తీసుకుని రిపోర్ట్ చేస్తున్నారని తెలిసింది. ఈ ఎనిమిదిమందిలో ముగ్గురు రిటైర్డ్ అధికారులు కూడా ఉన్నట్లు తెలిసింది. తమ హయాంలో చాలా ప్రాజెక్ట్‌లకు ఎన్ఓసీలు ఇవ్వడంలో ఈ అధికారులు కీలకపాత్ర పోషించారని హైడ్రా, ప్రస్తుత నీటిపారుదల శాఖ అధికారులు తేల్చారు. వీరి విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి కూడా హైడ్రా తీసుకెళ్లినట్లు తెలిసింది.



మెట్రో రైల్ రెండో దశను విస్తరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## మెట్రో రైల్ రెండో దశను విస్తరించాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, డిసెంబర్ 19: మెట్రో రైల్ రెండో దశను విస్తరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి అన్నారు. మెట్రో రైల్ రెండో దశను విస్తరించాలని, అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారంలోని ఏడు కాలనీలకు స్టార్మ్ వాటర్ డ్రైన్ సమస్య, జొన్నబండలోని 582, 583 సర్వే నంబర్లలోని 55 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని, ఇక్కడ 50 ఏండ్లుగా నివసిస్తున్న పేద వడ్డెరలకు న్యాయం చేయాలని గురువారం అసెంబ్లీలోని కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మెట్రో రైల్ రెండో దశను 105కిలో మీటర్లు విస్తరించాలన్నారు.జేబీఎస్ నుంచి మేడ్చల్ 20 కి.మీ, జేబీఎస్ నుంచి శామీర్‌పేట 22 కి.మీ, ప్యారడైజ్ నుంచి కండ్లకోయ 22 కి.మీ, బోయిన్‌పల్లి నుంచి గండిమైసమ్మ 21 కి.మీ, తార్నాక నుంచి కీసర 20 కిలోమీర్ల కనెక్టివిటీని ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని, రెండో దశకు సర్వే నిర్వహించాలని సీఎంను కోరారు. ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

### రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి..

రాష్ట్రంలోని రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. క్వింటాల్ బియ్యానికి ప్రస్తుతం ఇస్తున్న రూ.140 కమిషన్‌ను రూ.300కు పెంచాలని, క్వింటాల్ గోధుమలకు రూ.13ను రూ.140కి పెంచాలన్నారు. 55శాతం రేషన్ కార్డులు ఉన్నవారికే గోధుమలు సరఫరా అవుతున్నాయని, హమాలీ చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారని.. కానీ, ప్రతి క్వింటాల్‌కు రేషన్ డీలర్లే రూ.16 చొప్పున భరిస్తున్నారని తెలిపారు. ప్రతి 50కిలోల బస్తాలో 2నుంచి 3కిలోలు వ్యత్యాసంతో సరఫరా అవుతున్నాయన్నారు. కంటి ఆపరేషన్ చేసుకున్న వారిని ఐరిస్ గుర్తించడం లేదని, కుటుంబంలోని మరో వ్యక్తికి ఐడెంటిఫికేషన్ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలో ఇచ్చినట్లు డీలర్లకు నెలకు రూ.5వేల కమిషన్ పెంచాలని, బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

## మరో ఆరు నెలలు తప్పనిసరి

చెరువుల నోటిఫికేషన్‌కు గడువు చాలదన్న లేక్ విభాగం

ఇప్పటికీ 570 చెరువులకు తుది నోటిఫికేషన్ జారీ

సిటీబ్యూరో, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల హద్దుల నిర్ధారణకు కనీసం మరో 6 నెలల గడువు పడుతుందని తెలుస్తోంది. డిసెంబర్ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా.. ఆచరణలో సాధ్యం కాదనీ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 3500 చెరువులకు హద్దులు, ఎఫ్టీఎల్, బఫర్ జోన్ నిర్ధారిస్తూ తుది నోటిఫికేషన్ జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. అయితే కోర్టు విచారణ అనంతరం హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు నిర్వహించిన సమీక్షలో హద్దుల నిర్ధారణలో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఇప్పటికే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో సమన్వయ లోపం, హద్దుల గుర్తింపు ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఐదు నెలలుగా 570 చెరువులకు మాత్రమే పూర్తి చేయగలిగారు. ఈ క్రమంలో మరో ఆరు నెలల వరకు ఈ ప్రక్రియకు గడువు కోరాలని ఆదేశించినట్లు చెబుతున్నారు. చెరువుల పరిరక్షణలో కీలకమైన హద్దుల నిర్ధారణ ప్రక్రియను పూర్తి చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. దీంతో హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 3500కు పైగా చెరువులను ఈ నెల 30లోగా హద్దులు నిర్ధారించాలని ఇటీవలే హైకోర్టు ఆదేశించింది. కానీ ఈ వ్యవహారంలో హెచ్ఎండీఏ లేక్ విభాగం ఇంకా జాడ్యం వీడటం లేదు.

### ఎందుకు జాప్యం జరుగుతుందంటే..?

హైకోర్టు విచారణ తర్వాత జరిగిన సమీక్ష సమావేశంలో హెచ్ఎండీఏ అధికారులు పలు కీలక విషయాలను ప్రస్తావించినట్లు తెలిసింది. ముఖ్యంగా రెవెన్యూ, ఇరిగేషన్ ఆధీనంలో ఉన్న హద్దులే ప్రధాన కారణమని తెలిసింది. చెరువుల ప్రస్తుత విస్తీర్ణంతో పోల్చితే, ఆ శాఖల మ్యాపులలో పొందుపరిచిన వివరాలు విరుద్ధంగా ఉండటంతో కొత్త సమస్యలు వస్తున్నాయి. అయితే మూడు శాఖలను సమన్వయం చేసుకుంటూ కచ్చితమైన కొలతలతో హద్దుల నిర్ధారణ పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

## గోల్నాక డీ మార్ట్‌పై కేసు నమోదు

ఎండు మిర్చి ప్యాకెట్ పై 500 గ్రాముల స్టిక్కర్... లోపల 100 గ్రాములే..

పైసలు 500 గ్రాములకు వసూలు.. గమనించిన కస్టమర్

అడిగితే కస్టమర్‌ను దబాయించిన యాజమాన్యం

తూనికలు, కొలతల శాఖకు ఫిర్యాదు




తక్కువ గ్రాములున్న ఎండు మిర్చి ప్యాకెట్‌ను పరిశీలిస్తున్న డిస్ట్రిక్ట్ మెట్రోలాజీ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి

అంబర్‌పేట, డిసెంబర్ 19: గోల్నాక డీ-మార్ట్ పై కేసు నమోదైంది. ఓ వినియోగదారుడికి అమ్మిన వస్తువుల తూకంలో మోసం జరిగిందని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. గోల్నాక అన్నపూర్ణ నగర్‌కు చెందిన సాయి గురువారం డీ-మార్ట్‌లో సుమారు రూ.8500 విలువ చేసే వివిధ రకాల నిత్యావసర సరుకులు కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లిన తర్వాత సర్దుకొనే క్రమంలో ఎండు మిర్చి ( చిల్లీ తేజ) ప్యాకెట్‌ను పరిశీలించగా.. ప్యాకెట్ పై 500 గ్రాములు, ధర రూ.299 అని ఉంది. కానీ ప్యాకెట్‌లో మాత్రం 100 గ్రాముల ఎండు మిర్చి మాత్రమే ఉన్నాయి. సాయి వెంటనే డీ-మార్ట్‌కు వచ్చి విషయాన్ని అక్కడి ఇన్‌చార్జికి తెలిపాడు. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని నిర్లక్ష్యంగా మాట్లాడాడు. దీంతో సాయి స్థానికంగా ఉన్న నాయకులను అక్కడకు పిలిచి జరిగిన విషయం చెప్పాడు. స్థానిక నాయకులు జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్సై శ్రీరామ్ సంజీవరావు, శివ తమ సిబ్బందితో వచ్చి తక్కువ తూకం గల ఎండు మిర్చి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగతా వస్తువుల బరువులను అధికారులు తనిఖీ చేశారు. కొన్ని బాదం ప్యాకెట్లలో బాదం పుచ్చు పట్టినట్లు గమనించారు. వినియోగదారులను మోసం చేయడంతో పాటు ప్యాకెట్ పై అధిక బరువు ముద్రించి లోపల తక్కువ ఐటం పెట్టి ఎక్కువ ధర తీసుకున్నందుకు 36(2) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అలాగే పంచనామా చేసి సంబంధిత తక్కువ బరువు గల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.




### డీ మార్ట్‌ను సీజ్ చేయాలి : స్థానిక నాయకులు

వినియోగదారులను మోసం చేస్తూ వస్తువులను విక్రయిస్తున్న గోల్నాకలోని డీ మార్ట్‌ను సీజ్ చేయాలని స్థానిక నాయకులు అంబర్‌పేట శ్రీనివాస్‌యాదవ్, కె.రాంచందర్, కె.శ్రీనివాస్, సాయి, సాయికృష్ణ, రఘుప్రసాద్, సురేశ్, విజయ్ డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తున్న జలమండలి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

## సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యేను కలిసిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కాప్రా, డిసెంబర్ 19: జలమండలి 13, 14 డివిజన్ల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సైనిక్‌పురిలోని ఆయన నివాసంలో గురువారం కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒకే విధమైన పనికి ఒకే విధమైన వేతనం ఇవ్వాలని తాము చేసిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం రూ.19500 వేతనం ప్రకటించినప్పటికీ, అధికారుల తప్పిదం వల్ల పెరిగిన జీతాలు చేతికి రావడం లేదన్నారు. రూ.13,500 జీతం మాత్రమే ఇస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సీవరేజి కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.వెయ్యి, సేఫ్టీ కిట్లు ఇవ్వడం లేదని, ఎస్టీపీ, బిల్ కలెక్టర్స్‌కు సమయానికి జీతాలు కూడా రావడం లేదని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ దృష్టికి, ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అవసరమైతే జలమండలి ఎండీతో మాట్లాడుతానని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యూనియన్ డివిజన్ నాయకులు మారుతి ప్రసాద్, కిరణ్, బాబు, కుమార్, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రదీప్, శ్యామ్, అనిల్, నరేశ్, శ్రీకాంత్, ప్రసాద్, వెంకటేశ్, కిరణ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.